క్లుప్తంగా

జొన్నవాడలో వేలంపాటలు

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో వెలసిన కామాక్షితాయి అమ్మవారి ఆలయానికి చెందిన వివిధ హక్కుల కోసం సోమవారం బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. స్థానిక అతిథి గృహంలో జరిగిన వేలంపాటలో గోశాలలోని 20 ట్రక్కుల ఎరువును జొన్నవాడకు చెందిన కె.సుబ్రహ్మణ్యం రూ.33,500లకు పాడుకున్నారు. అలాగే ఖాళీ నూనె డబ్బాలను రూ.25 చొప్పున బుచ్చిరెడ్డిపాళెనికి చెందిన ఎస్.రమేష్ పాడుకోగా, ఐరన్ స్క్రాబ్‌ను కేజీ రూ.33 చొప్పున జొన్నవాడకు చెందిన బ్రహ్మయ్య పాడుకున్నారు. సులబ్ కాంప్లెక్స్, పాదరక్షలను భద్రత హక్కులకు ఎవరూ రాకపోవడంతో వాటిని వాయిదా వేశారు. ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, పర్యవేక్షణాధికారి వరప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ముస్లింలు



పొదలకూరు : మండలంలోని ముస్లిం పెద్దలు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సోమవారం నెల్లూరులో కలిశారు. పట్టణంలోని ఈద్గా మరమ్మతులు, సౌకర్యాలపై మంత్రికి విన్నవించారు. వెంటనే స్పందించిన మంత్రి కాకాణి అవసరమైన నిధులను మంజూరు చేయిస్తామన్నారు. వక్ఫ్‌బోర్డు జాయింట్ సెక్రటరీ ఖాదర్, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, అంజాద్, కో–ఆప్షన్ సభ్యుడు దస్తగిరి, నవరాజ్, ఖలీల్‌అహ్మద్, ఇబ్రహీం, రఫీ, మస్తాన్ ఉన్నారు.

వెంకటాచలంలో శాంతి ర్యాలీ

వెంకటాచలం: మణిపూర్‌లో క్రైస్తవులపై జరిపిన దాడులకు నిరసనగా, బాధిత కుటుంబాలకు మద్దతుగా వెంకటాచలం మండల క్రైస్తవ సమాఖ్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. సర్వేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద నుంచి కసుమూరు రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. కమిటీ సభ్యులు దార్ల సైమన్, తలారి వీరయ్య విలియం, డేవిడ్‌రాజు, విద్యుల్లత, యాకోబు, పరమానందం, జయకర్ పాల్గొన్నారు.

మురళీకృష్ణకు సన్మానం



ముత్తుకూరు : ముత్తుకూరుకు చెందిన జ్యోతిష్యమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణను సోమవారం రాత్రి హైదరాబాద్‌లో సన్మానించారు. పరాశర ఆస్ట్రో సైన్స్ ఆధ్వర్యంలో 17వ జ్యోతిష్య పుస్తకం 'సూర్య చంద్రులు' అనే గ్రంథం ఆవిష్కరణోత్సవం సందర్భంగా జరిగిన సదస్సులో మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పది మంది జ్యోతిష్యులకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు మహేష్ చంద్ర భరద్వాజ్ చేతుల మీదుగా మురళీకృష్ణను సన్మానించారు.

రాసాని నవల ఆవిష్కరణ



వెంకటాచలం: కథ, నవల, నాటక రచయిత డాక్టర్ వీఆర్ రాసాని కలం నుంచి వెలువడిన వొలికలబీడు, ఆదియోధుడు, మట్టి బతుకులు అనే మూడు నవలలను మండలంలోని సరస్వతీనగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో సోమవారం ఆవిష్కరించారు. కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్, అల్లు భాస్కర్‌రెడ్డి, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ పాల్గొని రాసానిని అభినందించారు.

లారీ బోల్తా

• తప్పిన పెను ప్రమాదం

మనుబోలు : మండల పరిధిలోని జాతీయ రహదారిపై బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం ఓ లారీ బోల్తా పడింది. అయితే అదే సమయంలో వెనుక నుంచి ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ పొడి లోడుతో నెల్లూరు వైపు నుంచి గూడూరు వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి వంతెన డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. దీంతో లారీలోని పొడి రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయింది. మధ్యప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ మన్సూర్ ఇస్లామ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న నిరంజన్‌బాబురెడ్డి

కోవూరు: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తున్నామని డీసీఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ పార్వతి అధ్యక్షతన ఎంపీడీఓ శ్రీహరి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామాల కోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ శ్రీలత, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ వడ్డిపాళెం, గోపాలపురం, రాయలసీమ కాలనీల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ నాలుగేళ్లలో దాదాపు రూ.2 లక్షల కోట్లతో సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందన్నారు. టీడీపీ, జనసేన, సీపీఎం, కాంగ్రెస్ వంటి పార్టీల నేతలకు కూడా సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 78 సచివాలయాల పరిధిలో 92,960 ఇళ్లను సందర్శించానని, ప్రతి కుటుంబంలో తమకు అపూర్వ స్వాగతం లభిస్తోందని తెలిపారు. అనంతరం గోపాలపురంలో కోడూరు సుధాకర్‌రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే ప్రసన్న పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి, కౌన్సిలర్లు షకీలాబేగం, మల్లారెడ్డి, అనంతమ్మ, మోర్ల జయంతి, పార్టీ నేతలు ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, భవాని, రఘు, గిరి, విల్సన్, గుంటూరు వెంకటేశ్వర్లు, డాక్టర్ అల్లాభక్షు పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు కళా వందనం

ముత్తుకూరు, మనుబోలు : పంద్రాగస్టును పురస్కరించుకుని మనుబోలులోని యాచవరం గ్రామానికి చెందిన సూక్ష్మకళాకారుడు ఆలూరు రాము బియ్యపు గింజపై జాతీయ జెండాను రూపొందించారు. అదేలా ముత్తుకూరులోని బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థిని ఉమా శర్వాణి పెన్సిల్ లెడ్‌పై జాతీయ జెండాను పట్టిన బాపూజీ చిత్రాన్ని రూపొందించింది. తెలుగు పండిట్ సోమా పద్మారత్నం కర్పూరం బిళ్లపై 'జాతీయ జెండాను ఎగురవేస్తున్న చిన్నారుల' చిత్రాన్ని రూపొందించారు.



బియ్యపు గింజపై జాతీయ జెండా





ఘనంగా 'నా భూమి–నా దేశం'

ముత్తుకూరు : ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ముత్తుకూరు మండలంలోని ఐదు సచివాలయాల పరిధిలో 'నా భూమి–నా దేశం' కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. నేలటూరు, తాళ్లపూడి, ముసునూరువారిపాళెం, వల్లూరు, డమ్మాయపాళెం సచివాలయాల పరిధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు మువ్వన్నెల పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటారు. దేశభక్తితో స్వాతంత్య్ర సమరయోధులను గౌరవించుకోవాలంటూ ప్రతిజ్ఞ చేశారు.

• కొడవలూరు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం 'నా భూమి–నా దేశం' కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. నార్తురాజుపాళెంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు చేతుల మీదుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, పంచాయతీ కార్యదర్శి జి.జాలయ్య, ఎఫ్‌ఏ దేవప్రసాద్ పాల్గొన్నారు.

• గుండాలమ్మపాళెంలోని సచివాలయం వద్ద 'నా భూమి–నాదేశం' శిలాఫలకాన్ని సోమవారం ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించడంతో పాటు దేశ సమైక్యతకు పాటుపడతామంటూ ప్రతిజ్ఞ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, పంచాయతీ కార్యదర్శి అంకమరాణి, వైఎస్సార్‌సీపీ నేత నాగేంద్రప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మూడుచోట్ల పోటీ

మనుబోలు : మండలంలోని మనుబోలు, చెర్లోపల్లి, మడమనూరు, బండేపల్లి గ్రామాల్లోని నాలుగు వార్డులకు ఉపఎన్నికల కోసం 14 మంది నామినేషన్లు దాఖలు చేయగా వాటిల్లో ఏడుగురు ఉపసంహరించుకున్నారు. చెర్లోపల్లిలోని ఓ వార్డుకు రెండు నామినేషన్లు రాగా వారిలో చేడిమాల వెంకటసుబ్బారెడ్డి నామినేషన్ ఉపసంహరించుకోగా వల్లూరు శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు తెలిపారు. కాగా మనుబోలులో ఇద్దరు, మడమనూరులో ముగ్గురు, బండేపల్లిలో ఇద్దరు చొప్పున బరిలో ఉన్నారు.

ఓటర్ల సర్వేను వేగవంతం చేయండి



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్

మనుబోలు : మండలంలో ఓటర్ల సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ శివకృష్ణయ్య అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల నమోదు ప్రక్రియను చాలా మంది బీఎల్‌ఓలు రాత పూర్వకంగా చేశారని, అయితే సేకరించిన వివరాలను తప్పనిసరిగా యాప్‌లో నమోదు చేయాలన్నారు. మొత్తం మీద 90 శాతం నమోదు ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. అందులో 50 శాతం మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదైందన్నారు. త్వరితగతిన నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డీటీ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్‌ఐ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం



కొడవలూరు: ఏకగ్రీవమైన వార్డు సభ్యులకు సన్మానిస్తున్న చలపతిరావు



తోటపల్లిగూడూరు : మనోహర్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

కొడవలూరు: మండలంలోని గౌతమ్‌నగర్, పాతవంగల్లులో రెండు వార్డుల వంతున నాలుగు వార్డుల్లోనూ వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా గెలుపొందారు. గౌతమ్‌నగర్ మూడో వార్డు సభ్యునిగా ఈసవరపు శంకరమ్మ, ఆరో వార్డుకు వన్నం వెంకటకృష్ణయ్య, పాతవంగల్లు రెండో వార్డుకు తైదుల బుజ్జమ్మ, మూడో వార్డుకు ధనం అనూష ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారులు రమేష్, లక్ష్మి ప్రకటించారు. కాగా ఎంపికైన వార్డు సభ్యులతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు నాగిరెడ్డి సునీల్‌కుమార్, బెజవాడ లక్ష్మీబాయిలను నార్తురాజుపాళెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు ప్రత్యేకంగా సన్మానించారు.

• పొదలకూరు : మండలంలో వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి సోమవారం తెలిపారు. దుగ్గుంట పంచాయతీ 9వ వార్డు (ఎస్టీ జనరల్) పంతగిరి సుబ్రహ్మణ్యం, బిరదవోలు పంచాయతీ 8వ వార్డు (ఎస్టీ మహిళ) యాకశిరి వెంకటరమణమ్మ, విరువూరు పంచాయతీ 2వ వార్డు (అన్‌రిజర్వుడ్) దాసినేటి అనంతరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు.

• తోటపల్లిగూడూరు : మండలంలో ఖాళీగా ఉన్న రెండు వార్డులకు ఇద్దరు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ కోవెరపాళెంలో ఆరో వార్డుకు నక్కా మనోహర్, పేడూరులో 8వ వార్డుకు ఉయ్యాల బేబి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. ఈ సందర్భంగా వారికి అధికారులు సోమవారం నియామక పత్రాలు అందజేశారు.

• ఇందుకూరుపేట: మండలంలోని కుడితిపాళెం 9వ వార్డు సభ్యుడిగా గంగపట్నం బలరామయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను సర్పంచ్ నాయుడు సురేష్ అభినందించారు.

• కోవూరు(విడవలూరు) : మండలంలోని అన్నారెడ్డిపాళెం, వరిణీ గ్రామాల్లోని రెండు వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసరావు తెలిపారు. అన్నాపాళెంలోని ఓ వార్డుకు ఈదూరు ప్రవీణ్, వరిణిలో ఓ వార్డుకు నట్టం సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పురాతన నాణేలు మాయం చేశారని ఫిర్యాదు

పొదలకూరు : మండలంలోని చిట్టేపల్లి ఎస్సీ కాలనీ సమీపంలో అంకమ్మ తిప్ప గుడి వద్ద లభ్యమైన పురాతన బంగారు నాణేలు, ఆభరణాలను మాయం చేశారని గుడిపాటి భానుశ్రీ అనే యువతి సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది తిప్పపై తేనె కోసం భానుశ్రీ తమ్ముడు వరుణ్, అతడి స్నేహితులు అజిత్, వెంకటేశ్వర్లు వెళ్లగా, అక్కడ దొరికిన చెంపును అంకయ్య అనే వ్యక్తికి ఇచ్చారు. అందులోని నాణేలు, ఆభరణాలను అంకయ్య మాయం చేసి ఏమీ లేవని వరుణ్‌కు చెప్పాడు. అయితే అందులో నాణేలను ఫొటోలు తీసి గతనెల 17న ఎస్పీకి భానుశ్రీ ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్పీ పొదలకూరు సీఐ సంగమేశ్వరరావును విచారణ జరిపి నివేదిక అందజేయాల్సిందిగా ఆదేశించారు. అయితే ఎలాంటి చర్యలు లేకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

నివేదిక అందజేశాం– సీఐ సంగమేశ్వరావు

నాణేలకు సంబంధించి సమగ్ర విచారణ నిర్వహించి ఎస్పీకి నివేదిక అందజేశామని సీఐ సంగమేశ్వరరావు వెల్లడించారు. భానుశ్రీ, అంకయ్యల మధ్య వివాదాలు ఏర్పడడంతో గొడవలు పడొద్దని బైండోవర్ చేసుకుని పంపామన్నారు.

'జగనన్నకు చెబుదాం'లో వినతుల స్వీకరణ



వినతిపత్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

పొదలకూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో తహసీల్దార్ కె.వీరవసంతరావు వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతుల నుంచి సోమవారం వినతిపత్రాలు స్వీకరించారు. పట్టాదారు పాసుపుస్తకాలు, భూ వివాదాలు, దారి తగాదాలు తదితర సమస్యలకు సంబంధించి తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి, హౌసింగ్ ఏఈ శివమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ బ్రోకర్‌పై ఫిర్యాదు

పొదలకూరు : పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ బ్రోకర్‌పై స్థానిక సబ్‌రిజిస్ట్రార్ శోభమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాసులురెడ్డి అనే వ్యక్తి తమ విధులకు ఆటంకం కలిగించి దౌర్జన్యానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరిముల్లా వెల్లడించారు.

21 నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

వెంకటాచలం: వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలోని సైరెడ్‌లో ఈ నెల 21 నుంచి మహిళలకు టైలరింగ్, మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సైరెడ్ డైరెక్టర్ రఘురామకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు కలిగి తెలుగు చదవడం, రాయడం వచ్చిన మహిళలు అర్హులని చెప్పారు. శిక్షణ జరిగే 30 రోజుల పాటు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు 0861 2383555, 80962 20239 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కారు టైర్ల చోరీ



వెంకటాచలం : మరమ్మతులకు గురైన కారును రోడ్డు పక్కన పార్కింగ్ చేయగా, అందులోని టైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన మండలంలోని తిక్కవరప్పాడు సమీపంలో సోమవారం ఉదయం వెలుగుచూసింది. సర్వేపల్లికి చెందిన ధర్మతేజారెడ్డి ఈనెల 12న కారులో నెల్లూరు వైపు నుంచి సర్వేపల్లికి వెళ్తుండగా, తిక్కవరప్పాడు సమీపానికి చేరుకోగానే కారు మరమ్మతులకు గురైంది. దీంతో రోడ్డు పక్కన కారును నిలిపి వెళ్లారు. సోమవారం ఉదయం కారును తీసుకెళ్లేందుకు రాగా నాలుగు టైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించారు. దీనిపై పోలీసులకు సమాచారం లేదు.

కాలువలో జారిపడి వ్యక్తి మృతి

పొదలకూరు : మండలంలోని విరువూరు ఎస్సీ కాలనీకు చెందిన మేకల మాధవ(45) చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. వివరాలు..విరువూరు ఎస్సీ కాలనీకు చెందిన మొలకల మాధవ(45) సమీపంలోని నెల్లూరు కాలువ వద్దకు చేపలు పట్టేందుకు ఆదివారం వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. మాధవ ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కాలువ వద్దకు వెళ్లి గాలించగా మృతదేహం కనిపించింది. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శవపంచనామా నిర్వహించిన ఎస్సై ఎస్కే కరిముల్లా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మర్యాదపూర్వకంగా..

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని దామరమడుగు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా ఎన్నికైన యాటా ప్రదీప్ కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బుచ్చిరెడ్డిపాళెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన కలిసి మొక్కను అందజేశారు. పార్టీ నేతలు లక్ష్మయ్య, నాగేంద్ర, రమేష్, రాజారెడ్డి, రషీద్, సుజాత పాల్గొన్నారు.

మినగల్లులో ఆడిట్

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని మినగల్లు పంచాయతీలో సోమవారం ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆడిట్ అధికారి తిరుపతయ్య మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో పంచాయతీ చెల్లింపులపై ముందస్తు ఆడిట్ నిర్వహించామని, ఎలాంటి అవకతవకలు లేవని గుర్తించామన్నారు. అసిస్టెంట్ ఆడిటర్ హరికృష్ణ, సీనియర్ ఆడిటర్ అబ్దుల్‌కలాం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

దామరమడుగు వద్ద రోడ్డు ప్రమాదం

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని దామరమడుగు వద్ద ముంబై జాతీయ రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం వైపు వస్తున్న కారు దామరమడుగు వద్దకు చేరుకునే సరికి ఓ ట్రాక్టర్‌ను రివర్సు తీస్తోంది. దీంతో ట్రాక్టర్ వెనుక భాగాన్ని కారు తాకింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినగా ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఎస్సై వీరప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.